క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలోకి 100 జనసేన కుటుంబాలు

గుంటూరు రూరల్: ప్రత్తిపాడు నియోజకవర్గం బుడంపాడు గ్రామానికి చెందిన జనసేన యువత 100 కుటుంబాల ప్రతినిధులు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ సోదరులు పార్టీ కండువాలను కప్పి సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో రజనీకాంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అరెస్ట్
ఆటో ఎక్కిన మహిళపై అత్యాచార యత్నం

పెదకాకాని: ఆటో ఎక్కిన మహిళను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్ళి అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసారు. పెదకాకానికి చెందిన దానబోయిన సాంబశివరావు (గోపి) ఆటో డ్రైవర్. ఈనెల ఆరో తేది రాత్రి గుంటూరు వెళ్ళేందుకు పెదకాకాని సెంటర్‌లో ఓ మహిళ అతని ఆటో ఎక్కింది. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులెవరూ లేకపోవడంతో గ్రామ శివారులోని విఆర్‌ఏ కార్యాలయం వెనుక ఉన్న నిర్మానుష ప్రాంతానికి ఆటో తీసుకు వెళ్ళాడు. గమనించిన ఆమె కేకలు వేయడంతో దాడి చేసి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. భయంతో కేకలు వేస్తూ రోడ్డుపైకి చేరుకుని పెదకాకాని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు నిందితుడు సాంబశివరావును అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు పెదకాకాని సీఐ కొమ్మనబోయిన వీరాస్వామి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతుడు కారసాని వెంకట్ (ఫైల్)

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిగా మరొకరు గాయపడిన సంఘటన గురువారం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరులోని కొరిటిపాడుకు చెందిన మెడికల్ షాపు యజమాని కారసాని వెంకట్, మరోవ్యక్తి రాజేష్‌తో కలిసి స్కూటీపై ప్రయాణిస్తుండగా సంగం గోపాలపురం- చెంఘీఖాన్‌పేట గ్రామాల మధ్య ఉన్న జగనన్న కాలనీ సమీపంలోని మలువు వద్ద స్కూటీ అదుపు తప్పింది. దీంతో సమీపాన ఉన్న పొలం ఫెన్సింగ్‌కు ఏర్పా టు చేసిన రాతి స్తంభానికి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారసాల వెంకట్ తలకు తీవ్రంగా, రాజేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. చికిత్స పొందుతూ వెంకట్ (30) మృతి చెందినట్లు యడ్లపాడు ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్ తెలిపారు.

ఏటుకూరు గ్రంథాలయ పరిశీలన



గుంటూరు రూరల్: ఏటుకూరులోని గ్రంథాలయాన్ని ఆ శాఖ కార్యదర్శి వి సుబ్బరత్నమ్మ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ రికార్డులను తనిఖీ చేశారు. గ్రంథాలయ అభివృద్ధికి అవసరమైన పలు సూచనలను గ్రంథాలయ నిర్వాహకురాలు పరమేశ్వరికి అందించారు.

వీరుల చరిత్ర ముందు తరాలకు స్ఫూర్తి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై గురువారం సాయంత్రం శ్రీ మహారాణా ప్రతాప్‌సింగ్ జయంతి నిర్వహించారు. గుంటూరు బొందిలి ఆధ్వర్యంలో వేడుకలు జరగ్గా, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ముఖ్య అతిథి డొక్కా మాణిక్యవరప్రసాద్ హాజరై మాట్లాడుతూ మహారాణా ప్రతాప్‌సింగ్ వంటి వీరుల చరిత్ర ముందు తరాలు తెలుసుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో రామరాజు ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామరాజు శ్రీనివాస్, ఏపీ బొందిలి సంఘం అధ్యక్షులు కె.శంకర్‌సింగ్, ఉపాధ్యక్షుడు క్షత్రిధర్మనారాయణసింగ్, విశ్రాంత ఏఎస్పీ భూపాల్‌సింగ్, నూతలపాటి తిరుపతయ్య, మహీందర్ సింగ్, శిండే లక్ష్మీనారాయణ, కుమార్ శేఖర్ పాల్గొన్నారు. అనంతరం బొందిలి నిత్యశ్రీహర్షిణి, భువనశ్రీ (కర్నూల్)లను సత్కరించారు.

ఓటు హక్కుపై అవగాహన

నెహ్రూనగర్: ఓటు మన ప్రాథమిక హక్కు అని, ఓటు వేయడం కనీస బాధ్యత అని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు రూరల్ ఏరియా కో ఆర్డినేటర్ వడ్డే రవితేజ పేర్కొన్నారు. గురువారం ఓబుల్‌నాయుడుపాలెం, డంపింగ్ యార్డు, అంబేడ్కర్ కాలనీలో ఉన్న వేస్ట్ పికర్స్‌కు స్వేచ్ఛగా ఓటు వేద్దాం, సమర్థులను ఎన్నుకుందాం అనే అంశంపై అవగాహన కల్పించారు.

జగనన్నే మళ్లీ సీఎం

- ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్
- 26వ డివిజన్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం


ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటువేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య కుమార్తె కిలారి సాయి

గుంటూరు రూరల్: వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరో సారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ,ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా 26వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ శ్యామల వెంకట రమణాదేవితో కలిసి అంకిరెడ్డిపాలెం, పొత్తూరు, నాయుడుపేట, చౌడవరం, జూనం చుండూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య కుమార్తె కిలారి సాయితో ప్రచారరథంపై నుంచి ప్రజలకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా దారిపొడవునా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు సాదర స్వాగతం పలికారు. పూల వర్షాన్ని కురిపించి అభిమానాన్ని చాటుకున్నారు. బాణసంచా,డీజేలు, తీన్‌మార్ డప్పులతో ప్రచారాన్ని మోతెక్కించారు. గ్రామంలోని మహిళలు ప్రచార రథానికి తమ అభిమాన నాయకుడికి దిష్టితీసి, హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని మాట్లాడుతూ ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఒక ఓటు తనకు, రెండో ఓటు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్యకు ఫ్యాన్ గుర్తుపై వేసి విజయం చేకూర్చాలని కోరారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఓటువేయాలని పిలుపునిచ్చారు. ఆడబిడ్డల మోములో చిరునవ్వులు చూసేందుకు మీ తోడుగా అక్కడ జగనన్న ఉన్నాడు. ఇక్కడ మీకు అండగా ఈ కిరణన్న ఉన్నాడంటూ భరోసా ఇచ్చారు. 2014కు ముందు చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి నిండా ముంచాడని మరోసారి మహిళలను రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నాడని విమర్శించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. కూటమికి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని కోరారు.


ప్రచార వాహనానికి హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

మోసగాళ్ల మాటల్ని నమ్మొద్దు

- పేదల అభ్యున్నతి, సంక్షేమమే జగనన్న లక్ష్యం
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత రావెల కిషోర్‌బాబు


మాట్లాడుతున్న కిషోర్‌బాబు

చేబ్రోలు: పేదల అభ్యున్నతి, సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు అన్నారు.టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రజలను మభ్యపెట్టి మోసగించటానికి కుట్రలు పన్నుతోందని విమర్శించారు. మండల కేంద్రమైన చేబ్రోలులో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రావెల మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన సాగించిందన్నారు.72వేల కోట్లతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరణ చేశారని, ఇంగ్లిషు మీడియం బోధనను చేపట్టినట్లు తెలిపారు. పేదవాడి చుట్టూ పాలన సాగిందన్నారు. వైఎస్సార్‌సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ సేవాతత్పరుడన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య సేవలు, కళ్ల జోళ్లు, గుండె పరీక్షలు తదితర కార్యక్రమాలు చేపట్టారని ప్రశంసించారు. పార్టీ గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న పోటీలో పేదల పక్షపాతి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ప్రజాధనాన్ని దోచుకొని, మాయ మాటలతో గారెడి ఎత్తుగడలు వేసే టీడీపీ మోసగాళ్ల మాటలను ప్రజలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర నియోజకవర్గంలో ప్రజా సంపదను కొల్లగొట్టి కోట్లాది రూపాయిల సొమ్మును దోచుకున్నారని ఆరోపించారు. గుంటూరు రూరల్ మాజీ జడ్పీటీసీ వై కోటేశ్వరరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కొక్కిలగడ్డ కిరణ్‌కుమార్, పి కోటేశ్వరరావు, కె రాజేంద్ర, బి విజయ కుమార్, వి జయశ్రీ, వై మమత తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలి

లక్ష్మీపురం: ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం 'ప్రశ్నార్థకంగా మారిన ప్లాస్టిక్‌లపై పోరు' అంశంపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమనేత పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను అంతం చేసి భవిష్యత్తును కాపాడుకునే విషయంలో కొత్త అంతర్జాతీయ ఒడంబడిక నిమిత్తం గత వారం కెనడాలోని ఓట్టావాలో జరిగిన 192 దేశాల ప్రతినిధుల సమావేశంలో సరైన నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు.

మేము సైతం..మీ విజయం కోసం

బలసానికి భరోసాగా


ప్రత్తిపాడులో బలసానికి మద్దతుగా ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తోన్న పార్టీ శ్రేణులు


వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో ప్రచారం చేస్తోన్న నాయకులు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పార్టీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యల విజయాన్ని కాంక్షిస్తూ వార్డు స్థాయి నుంచి పట్టణస్థాయి వరకు శ్రేణులు ఆయా ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించాయి. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ వారికి మద్దతుగా గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అందిన సంక్షేమాభివృద్ధితోపాటు మరోసారి అధికారంలోకి వస్తే అమలు చెయ్యబోయే పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.


పాతమల్లాయపాలెంలో ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలంటూ ప్రచారం చేస్తోన్న ప్రజాప్రతినిధులు


పెదగొట్టిపాడులో ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలంటూ ప్రచారం చేస్తోన్న పార్టీ నాయకులు

అంబటికి అండగా


బూత్ పరిధిలో ప్రచారం చేస్తున్న పుట్ల సంపత్, కార్యకర్తలు


దొప్పలపూడిలో ప్రచారం చేస్తున్న బొనిగల వేణుప్రసాద్

పొన్నూరు: మేము సైతం...మీ విజయం కోసమంటూ పొన్నూరు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణకు మద్దతుగా పలుచోట్ల ప్రచారం చేపడుతున్నారు. గురువారం జరిగిన ప్రచారంలో ఇంటింటికీ వెళ్లి ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూ పార్టీ శ్రేణులు ముందుకు కదులుతున్నాయి. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో అందరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణలను గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులకు ప్రజల నుంచి ఆదరాభిమానాలు లభిస్తున్నాయి.


17వ వార్డులో ప్రచారం చేస్తున్న బోయి నాగరాజు, కార్యకర్తలు


25వార్డులో ప్రచారం చేస్తున్న మహిళా నాయకులు

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పరిసమాప్తం


పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో వేచి ఉన్న ఉద్యోగులు


తనిఖీలు చేసి కార్యాలయం లోపలకు పంపిస్తున్న పోలీసులు

ప్రత్తిపాడు: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఘట్టం గురువారంతో ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల ఐదో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు నియోజక వర్గాల వారీ ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ప్రత్తిపాడు నియోజక వర్గం నుంచి మొత్తం 2,388 మందికి 1,897 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ ప్రక్రియ ముగిసిందని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ తెలిపారు.

అమెరికన్ యూనివర్సిటీలతో ఏఎన్‌యూ ఎంఓయూ


ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్ సమక్షంలో ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న వర్సిటీ ప్రతినిధులు

ఏఎన్‌యూ: అమెరికాకు చెందిన టెక్సాస్ వెస్లియాన్ యూనివర్సిటీ, లెటర్నియో యూనివర్సిటీలతో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంఓయూ కుదుర్చుకుంది. టెక్సస్ వెస్లియాన్ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ అడ్మిషన్ కోఆర్డినేటర్ జూలిస్మిత్ బృందం గురువారం ఏఎన్‌యూని సందర్శించింది. యూనివర్సిటీ సైన్స్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగాన్ని బృంద సభ్యులు సందర్శించారు. ఆ విభాగంలోని మౌలిక వసతులు, పరిశీలించారు. ఫార్మసి, ఫిజిక్స్, బుద్ధిస్ట్ స్టడీస్ విభాగాలను సందర్శించి విదేశీ విద్యార్థులతో మాట్లాడారు. అంతర్జాతీయ విద్యార్థుల వసతి గృహం సందర్శించి సదుపాయాలను విద్యార్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైస్ చాన్సలర్ ఆచార్య పి.రాజశేఖర్‌తో సమావేశమయ్యారు. అమెరికాలోని లెటరిన్యో యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ కోర్సు చదవడానికి నాగార్జున విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉన్న అవకాశాన్ని వివరించారు. విద్యార్థులు సగం కోర్సు ఏఎన్‌యూలోను మిగిలిన కోర్సును అమెరికా యూనివర్సిటీలో పూర్తి చేసుకునే వెసులుబాటు ఈ ఎంఓయూ ద్వారా అవకాశం ఉందని ఏఎన్‌యూ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి.చెన్నారెడ్డి తెలిపారు. ఈ ఎంవోయూ మూడేళ్లపాటు కొనసాగుతుందన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి రాజశేఖర్ మాట్లాడుతూ ఈ ఎంఓయూలు ఎన్‌యూకి ఎంతో ప్రయోజనం చేకూర్చుతాయన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎల్.ఉదయ కుమార్ పాల్గొన్నారు.

పరుగు పందెంలో దుగ్గిరాల లైన్‌మెన్ ప్రతిభ

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల గ్రామంలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్ కె.నరేంద్రబాబు రన్నింగ్ కాంపిటీషన్‌లో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించిన సందర్భంగా గురువారం దుగ్గిరాల సబ్ స్టేషన్ ఏఈ ఎస్.సత్యనారాయణ అభినందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నెల్లూరు ఏపీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఇటీవల నిర్వహించిన ఇంటర్ సర్కిల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2023-2024 పోటీలలో 5వేల మీటర్ల పరుగు పందెంలో కె.నరేంద్రబాబు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో 24 గంటలు కుక్క కాటుకు ఓపీ సేవలు

గుంటూరు మెడికల్: కుక్కకాటు బాధితులకు గుంటూరు జీజీహెచ్‌లో 24 గంటలు ఓపీ వైద్య సేవలు ఉన్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం ఆస్పత్రి ఓపీ విభాగంలో కుక్కకాటుకు ఇంజక్షన్లు ఇచ్చే 14 బీ గదిని ఆయన పరిశీలించారు. కుక్క కాటు బాధితులు రోజుకు ఎంత మంది వస్తున్నారు, వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి లోని 14 ఓపి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం4 గంటల వరకు ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు పొదిల ప్రసాద్ బ్లాక్‌లో కుక్కకాటు ఇంజక్షన్లు చేస్తారని చెప్పారు. ఒక్కొక్కసారి 50 నుంచి 100 మంది వరకు కుక్క కాటు బాధితులు వస్తున్నారని తెలిపారు. జీజీహెచ్‌కు ప్రతిరోజు కుక్కకాటు బాధితులు ఎంత మంది వస్తున్నారో వాటి వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ఆన్ లైన్ లో పొందుపర్చాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. కుక్క కరచిన వెంటనే వ్యాక్సిన్ తీసుకోవాలని, వీధి కుక్కలు, పెంపుడు కుక్కల విషయం లో కూడా పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కుక్క కాటు వల్ల రేబీస్ అనే ప్రాణాంతక జబ్బు వస్తుందని అది వస్తే మనిషి కి ప్రాణానికే ముప్పు వస్తుందని హెచ్చరించారు. కుక్క కాటుకు గురైతే తక్షణమే చికిత్స అవసరమని సూచించారు.

16 నుంచి కొలంకపురి నాటక కళాపరిషత్ నాటికల పోటీలు

కొలకలూరు(తెనాలి): కొలంకపురి నాటక కళాపరిషత్, కొలకలూరు, వైకే నాటక కళాపరిషత్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో దశమ ఆహ్వాన నాటికల పోటీలు ఈనెల 16వ తేదీనుంచి రూరల్ మండల గ్రామం కొలకలూరులో నిర్వహించనున్నారు. నాలుగురోజులపాటు జరిగే ఈ ఆహ్వాన నాటికల పోటీలను తొలిరోజున సాయంత్రం 6.45 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తారు. కళాంజలి, హైదరాబాద్ వారి 'రైతేరాజు', ఉషోదయా కళానికేతన్, కట్రపాడు వారి 'విముక్తి' నాటికలను ప్రదర్శిస్తారు. వైఎస్‌కేఎన్ స్వామి అధ్యక్షతన జరిగే ప్రారంభసభలో కరణం సురేష్ జ్ఞాపకార్థం ఏటా ప్రదానం చేస్తున్న సవ్యసాచి అవార్డును ఏలూరుకు చెందిన రంగస్థల నటుడు, దర్శకుడు ఎండీ ఖాజావలికి ప్రదానం చేస్తారు. రెండోరోజైన 17న మిత్రా క్రియేషన్స్, నరసరావుపేట సమాజంచే 'నోట్ దిస్ పాయింట్', శ్రీకృష్ణా తెలుగు థియేటర్ ఆర్ట్స్, న్యూఢిల్లీ వారి 'మళ్లీ కలిసి జీవిద్దాం' నాటికలను ప్రదర్శిస్తారు. స్వర్గీయ డీఎస్ దీక్షిత్ స్మారక పురస్కారంతో గుంటూరుకు చెందిన రంగస్థల నటుడు, దర్శకుడు ఎన్. రవీంద్రారెడ్డిని సత్కరిస్తారు. 18న అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి 'ఇంద్రప్రస్థం', గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ వారి 'మూల్యం', కళానికేతన్, వీరన్నపాలెం వారి 'రాజుగారి గోదీ' నాటికలను ప్రదర్శిస్తారు.

పోలింగ్‌కు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు

తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి


ఏసీ కాలేజీలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న నగర కమిషనర్, తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో పోలింగ్ రోజు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు తూర్పులో సెక్టార్ అధికారుల వారీగా కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌కు ఏ సమస్యలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా ఏఈలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, పీడీఎంఎస్ యాప్ వినియోగం, ఉదయం 5 గంటలకల్లా మాక్ పోలింగ్ జరిగేలా, ఎక్కడైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే పరిష్కార చర్యలు తీసుకోవడం, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈఈ సుందర్రామిరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందితో ఆయా ఏర్పాట్లను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా రిపోర్టింగ్ టీం, క్విక్ రియాక్షన్ టీంలను ఏర్పాటు చేస్తామని, పోలింగ్ సమయంలో శాంతి భద్రతలు, సాంకేతిక సమస్యలు ఎదురైనా తక్షణం రిటర్నింగ్ అధికారి టీం లేదా రిపోర్టింగ్ టీం దృష్టికి తీసుకువచ్చేలా పీఓలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చేపట్టాల్సిన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఈఈని ఆదేశించారు. అనంతరం పోలింగ్‌కు సంబంధించిన మెటీరియల్ పంపిణీ కేంద్రమైన ఏసీ కాలేజీని పరిశీలించి, పోలింగ్‌కు ముందు రోజు ఉదయం నుంచే పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేస్తామన్నారు. ఏసీ కాలేజీలో మెటీరియల్ పంపిణీకి అవసరమైన టేబుల్స్ ఏర్పాటు చేయాలనిపట్టణ ప్రణాళిక అధికారులను, ఇతర సిబ్బందికి భోజన సదుపాయాలను అందించే వివరాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని, సమస్యలు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమాల్లో ఏఆర్‌ఓలు సునీల్ కుమార్, భీమరాజు, ప్రదీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఎంహెచ్ఓ మధుసూదన్, ఈఈ సుందర్రామిరెడ్డి, సెక్రటేరియల్ అధికారి బి.శ్రీధర్ బాబు, డీఈఈ రమేష్ బాబు, ఏసీపీ మురళి, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఎస్ఎస్ రాంబాబు, సూపరింటెండెంట్ పద్మనాభరావు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.